ఖాదీ అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలి

- మెట్‌పల్లి ఖాదీ ప్రతిష్ఠాన్ చైర్మన్ విద్యాసాగర్‌రావు
- కాంప్లెక్స్‌లోని దుకాణ సముదాయాల పరిశీలన

ఖాదీలోని దుకాణ సముదాయాల్లో దుకాణాదారుడితో మాట్లాడుతున్న అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

మారుతీనగర్, సెప్టెంబర్ 19: మెట్‌పల్లి ఖాదీ కాంప్లెక్స్‌లోని దుకాణాల యజమానులు బకాయిలను చెల్లించి ఖాదీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సూచించారు. గురువారం దుకాణ సముదాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణాదారుల సమస్యలను అడిగి తెలుసుకొని, సకాలంలో బకాయిలను చెల్లించాలన్నారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, త్వరగా పరిష్కరించాలని మేనేజర్ గుర్రాల మాదవ్‌కు సూచించారు. అలాగే మెట్‌పల్లి ఖాదీ వస్త్రాలపై 40శాతం తగ్గింపును ఈ నెల 25 నుంచి దీపావళి వండుగ వరకు అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మెట్‌పల్లిలో వృద్ధురాలి మృతి

మారుతీనగర్, సెప్టెంబర్ 19: ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మెట్‌పల్లి పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కళానగర్‌లో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలు ఎగ్గర్ల మమత(65) భర్త మృతి చెందగా, ఇంటిలో ఒంటరిగా జీవిస్తున్నది. నాలుగు రోజులుగా ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి పరిశీలించారు. స్నానం చేసేందుకు వెళ్లి కాలుజారీ కిందపడి తలకు గాయాలై మృతి చెంది ఉంటుందని, కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి వివరించారు.

రోడ్డు మధ్యలో స్తంభం.. వెళ్లేదెలా..?

నీసీరోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం

మారుతీనగర్, సెప్టెంబర్ 19: 'అసలే ఇరుకైన సీసీ రోడ్డు, మధ్యలో కరెంట్ స్తంభం'.. ఇదీ మెట్‌పల్లి పట్టణంలోని ఏడో వార్డులోని ఓ వీధిలో పరిస్థితి. ఓ వైపు నిధులు లేక పనులు జరుగక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. ఇక్కడ మాత్రం పనులు ఇష్టారాజ్యంగా చేసి ప్రజాధనం వృథా చేయడం మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నది. సీసీ రోడ్డు మధ్యలోనే స్తంభం ఉండడంతో ద్విచక్రవాహనాల రాకపోకలు, స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బంది అవుతున్నది. స్తంభాన్ని తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వానాకాలం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయండి

- ఎక్కడా ఇబ్బందులు రాకుండా చూడాలి
- కలెక్టర్ బీ సత్యప్రసాద్
- కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష

వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, సెప్టెంబర్ 19: వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లకు విస్తృత ఏర్పాట్లు చేయాలని, ఎక్కడా ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో 2024-25 వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సీజన్‌లో వరి క్వింటాల్‌కు మద్దతు ధర గ్రేడ్-ఏ రకానికి రూ.2,320, కామన్ రకానికి రూ.2300గా ప్రభుత్వం నిర్ణయించిందని, కొనుగోలు కేంద్రంలో ప్యాడీ క్లీనింగ్ మెషిన్స్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. టోకెన్ పద్ధతి పాటించాలని, రైతులకు సరిపడా టార్పాలిన్ కవర్స్ అందుబాటులో ఉంచాలని, ఏ రోజుకు ఆ రోజు ధాన్యం నాణ్యత పరీక్షించి రికార్డులో నమోదు చేయాలని తెలిపారు. సన్న రకం, దొడ్డురకం వడ్లను గుర్తించేందుకు గ్రెయిన్ కాలిపర్స్ (సన్న వరి గుర్తింపు కోసం డయల్ మైక్రో మీటర్) ప్రతి కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రైస్ మిల్లులో ఎక్కువ సంఖ్యలో హమాలీలను సమకూర్చుకోని మిల్లుకు వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకోవాలని, రైతుల ఖాతాల్లో వెంట వెంటనే డబ్బులు జమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యంలో నాణ్యత లేకపోతే సంబంధిత పౌరసరఫరాల క్షేత్రస్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సరిపడా గన్నీ సంచులు ముందస్తుగానే సిద్ధం చేసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లుకు త్వరితగతిన రవాణా చేయాలని పౌరసరఫరాల అధికారులను ఆదేశించారు. ధాన్యం రవాణాలో ఏదైనా ఇబ్బంది తలెత్తితే రవాణా శాఖ సహకారం తీసుకోవాలని సూచించారు. ధాన్యం నిల్వ చేసేందుకు సరిపడా గోదాములని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, జిల్లా పౌరసరఫరాల అధికారి, జిల్లా మేనేజర్ పౌరసరఫరాల సంస్థ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి, జిల్లా సహకార శాఖ అధికారి పాల్గొన్నారు.

పద్మశాలీలు సంఘటితమైతేనే సర్వతోముఖాభివృద్ధి

- ఎమ్మెల్సీ ఎల్ రమణ

హిమాయత్‌నగర్, సెప్టెంబర్19: రాష్ట్రంలోని పద్మశాలీలు సంఘటితమైతేనే సర్వతో ముఖాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ ఎల్ రమణ, రాష్ట్ర ఖనిజ అభివృద్ధి కార్పొరేషన్ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి పేర్కొన్నారు. పద్మశాలీ సంఘం ఎల్‌బీనగర్ సర్కిల్ ఆధ్వర్యంలో వచ్చే నెల 20న ఆటోనగర్‌లోని హరిణి వనస్థలి అనన్య ఎకో పార్క్ ఆవరణలో జరిగే 22వ పద్మశాలీ దసరా మేళాకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. మేళాకు సంబంధించిన బ్రోచర్‌ను నారాయణ గూడలోని పద్మశాలీ భవన్‌లో గురువారం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సహ్నేహక సమావేశంలో పద్మశాలీ సంఘం ఎల్‌బీనగర్ సర్కిల్ అధ్యక్షుడు పున్న గణేశ్ నేత, మేళా కమిటీ చైర్మన్ కౌకుంట్ల రవితేజతో కలిసి వారు మాట్లాడుతూ పద్మశాలీల ఐక్యతను చాటేందుకు దసరా మేళా ఎంతో దోహద పడుతుందని, ప్రతి ఒక్కరూ తరలిరావాలని పిలుపునిచ్చారు.

నారాయణగూడలో దసరా మేళా బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఎల్ రమణ, అనిల్‌కుమార్

కేటీఆర్‌ను కలిసిన అమ్మ ప్రొడక్షన్ టీమ్

వీణవంక, సెప్టెంబర్ 19: అమ్మ ప్రొడక్షన్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న 'ది కాప్' సినిమా విశేషాలపై దర్శకుడు జీఎస్ గౌతం కృష్ణ, నిర్మాత సతీశ్ నిమ్మల బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన దర్శకుడు జీఎస్ గౌతం కృష్ణ అమ్మ ప్రొడక్షన్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. ఈ క్రమంలో టీజర్ విడుదలకు ఏర్పాట్లు చేస్తున్నారు. సినిమా బడ్జెట్, చిత్రీకరణ, సన్నివేశాలు తదితర విషయాలు తెల్సుకొని త్వరలోనే జరిగే టీజర్ విడుదల ఫంక్షన్‌కు కేటీఆర్‌ను ఆహ్వానించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, పాడి రాజశేఖర్‌రెడ్డి, అమ్మ ప్రొడక్షన్ మేనేజర్ వెంకటేశ్ నిమ్మల, సోషల్ మీడియా ఇన్‌చార్జి ముక్క కార్తీక్, గొట్టె లైటింగ్ ఇన్‌చార్జి, టీమ్ సభ్యులు పోతుల రమేశ్, శ్రీరాంటోని, జక్కె విష్ణు, నటీనటులు వడ్లూరి సర్వేశ్వర్, వెంకట్, మల్లన్న, శ్రీధర్ పాల్గొన్నారు.

ఐదుగురు సీఐల బదిలీ

కరీంనగర్ రాంనగర్, సెప్టెంబర్ 19 :మల్టీజోన్-1 పరిధిలో ఐదుగురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ ఉత్వర్వులు జారీ చేశారు. వీరిలో కరీంనగర్ వన్‌టౌన్ సీఐ జే సరిలాల్ టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ కాగా, టాస్క్‌ఫోర్స్ సీఐ బిల్ల కోటేశ్వర్ వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా రానున్నారు. నిర్మల్ స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ అశోక్ బాన్సువాడకు, ఇక్కడ పని చేస్తున్న మున్నూరు కృష్ణ ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయనున్నారు. ఎండీ సాజిదుల్లా ఇంటలిజెన్సీ నుంచి బాన్సువాడ రూరల్‌కు బదిలీ కాగా అక్కడ పని చేస్తున్న పంతంగి సత్యనారాయణను ఐజీ కార్యాలయానికి బదిలీ చేశారు.

డెంగ్యూతో వివాహిత మృతి

చిగురుమామిడి, సెప్టెంబర్ 19 : కరీంనగర్ జివల్లా చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన శిరవేణి శిరీష (30) డెంగ్యూ జ్వరంతో గురువారం మృతిచెందింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్న శిరీష గురువారం ఇంటి వద్ద అపస్మార్గ స్థితిలో పడిపోగా, తల్లిదండ్రులు వెంటనే హుస్నాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలు శిరీష కొన్ని రోజులుగా డెంగ్యూ జ్వరంతో బాధపడుతున్నట్లు డాక్టర్లు నిర్ధారించినట్లు ఎస్ఐ బండి రాజేశ్ తెలిపారు. మృతురాలి తండ్రి బొల్లి పరశురాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతురాలికి ఇద్దరి పిల్లలు ఉన్నారు.

నక్కలపేటలో పోలీసుల అడ్డగింత.. ఉద్రిక్తత

- దాడి కేసును నీరుగారుస్తున్నారంటూ గ్రామస్తుల ఆగ్రహం
- ఉదయం హత్యాయత్నం జరిగితే 'విచారణకు రాత్రి వస్తారా' అంటూ మండిపాటు
- ఇద్దరు ఎస్ఐల అడ్డగింత

పోలీసుల వాహనాలను అడ్డుకున్న గ్రామస్తులు

ధర్మపురి, సెప్టెంబర్19: నక్కలపేటలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తుల మధ్య ఉన్న భూ తగాదాలు నెలకొనడం, అన్న కొడుకుపై బాబాయ్ దాడి చేయడం కలకలం రేపగా, పోలీసులు కేసును నీరుగారుస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం దాడి జరిగితే 'విచారణకు రాత్రి వస్తారా' అంటూ మండిపడ్డారు. వివరాల్లోకి వెళితే.. ధర్మపురి మండలం నక్కలపేటలో ఒకే కుటుంబానికి చెందిన మూటపల్లి శ్రీనివాస్, అతని బాబాయ్ మూటపల్లి లక్ష్మణ్‌కు కొంత కాలంగా భూతగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో బుధవారం ఉదయం లక్ష్మణ్ శ్రీనివాస్‌పై గడ్డపారతో దాడి చేయడం, బాధితుడు నేరుగా ఠాణాకు వెళ్లి లక్ష్మణ్‌పై ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే దాడి చేసిన లక్ష్మణ్ పరారీలో ఉండగా, పోలీసులు ఉదయం నుంచి గాలిస్తున్నారు. బుధవారం రాత్రి నక్కలపేటకు మొదట ఏఎస్ఐ రాజు చేరుకోగా అతన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. 'ఉదయం దాడి జరిగితే ఇప్పుడా వచ్చేది..?, 'లంచం తీసుకొని నిందితున్ని వదిలేస్తారా'..? ఆరోపిస్తూ అడ్డుకున్నారు. తర్వాత సమాచారం మేరకు ధర్మపురి ఎస్ఐ మహేశ్, బుగ్గారం ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి సైతం అక్కడికి చేరుకోగా, గ్రామస్తులు ఎస్ఐల వాహనాలు గ్రామంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. చివరకు ఇద్దరు ఎస్ఐలు, ఏఎస్ఐ గ్రామస్తులకు నచ్చజెప్పి పరారీలో ఉన్న లక్ష్మణ్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దాడికి ఉపయోగించిన గడ్డపారను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు ఎస్ఐలను గ్రామస్తులు అడ్డుకోవడంతో గ్రామంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

ఎఫ్ఎస్ఎన్ఎల్‌ను అమ్మేసిన కేంద్రం

రూ.320 కోట్లకు జపాన్ సంస్థకు విక్రయం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: కేంద్ర సర్కార్ మరో ప్రభుత్వరంగ సంస్థను అమ్మేసింది. వాటాల విక్రయంలో భాగంగా ఫెర్రో స్క్రాప్ నిగం లిమిటెడ్(ఎఫ్ఎస్ఎన్ఎల్)ని జపాన్‌కు చెందిన కోనాయికీ ట్రాన్స్‌పోర్ట్ కో లిమిటెడ్‌కు రూ.320 కోట్లకు విక్రయించింది. స్టీల్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఎఫ్ఎస్ఎన్ఎల్..ఎంఎస్‌టీసీ లిమిటెడ్‌కు చెందిన 100 శాతం సబ్సిడరీ సంస్థ. ఈ ఎఫ్ఎస్ఎన్ఎల్ విక్రయానికి కేంద్రం గతంలోనే నిర్వహించిన బిడ్డింగ్ ప్రక్రియకు రెండు బిడ్డింగ్‌లు టెక్నికల్‌గా అర్హత సాధించాయి. వీటిలో జపాన్‌కు చెందిన కోనాయికీ అత్యధికంగా రూ.320 కోట్ల బిడ్డింగ్ దాఖలుకు కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, హెచ్‌డీ కుమార స్వామి నేతృత్వంలోని ప్రత్యేక కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రిజర్వు ధర రూ.262 కోట్లుకాగా, బిడ్డింగ్ రూ.320 కోట్లు దాఖలవడంతో దీనికి మొగ్గుచూపింది కేంద్రం. మరో బిడ్ ఇండిక్ జియో రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్(చందన్ స్టీల్ లిమిటెడ్‌కు చెందిన సబ్సిడరీ సంస్థ) దాఖలు చేసినట్లు తెలిపింది. టోక్యో స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టైన కోనాయిక్ ట్రాన్స్‌పోర్ట్ కో లిమిటెడ్. సంస్థకు స్టీల్ రంగంలో 140 ఏండ్లకు పైగా అనుభవం ఉన్నది. 1979 నుంచి ఎఫ్ఎస్ఎన్ఎల్ స్టీల్ మిల్ సేవలను అందిస్తున్నది. పలు స్టీల్ ప్లాంట్ల నుంచి సేకరించిన స్క్రాప్ స్టీల్‌ను తిరిగి వినిమయంలో తెస్తున్నది సంస్థ.

హైదరాబాద్‌లో అల్ట్రావయలెట్

హైదరాబాద్, సెప్టెంబర్ 19: ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన మోటార్‌సైకిళ్ల తయారీ సంస్థ అల్ట్రావయలెట్... తాజాగా రాష్ట్రంలోకి అడుగుపెట్టింది. హైదరాబాద్‌లో తన తొలి షోరూంను గురువారం ప్రారంభించింది. దీంతో సంస్థకు ఇది ఐదో షోరూం కావడం విశేషం. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో, కో-ఫౌండర్ నారాయణ్ సుబ్రమణియమ్ మాట్లాడుతూ.. వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో అడుగుపెట్టినట్లు, ఈ ఏడాది చివరినాటికి మొత్తం అవుట్‌లెట్ల సంఖ్యను పదికి పెంచుకోబోతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అధిక మైలేజీని కోరుకుంటున్నవారిని దృష్టిలో పెట్టుకొని తొలి మాడల్ ఎఫ్77ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ బైకు సింగిల్ చార్జింగ్‌తో 320 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నదన్నారు. దీంట్లో 7.1 కిలోవాట్లా బ్యాటరీ కలిగిన మాడల్ ధర రూ.2.99 లక్షలుగాను. 10.1 కిలోవాట్లా బ్యాటరీ మాడల్ రూ.3.99 లక్షలుగా నిర్ణయించింది. మరోవైపు, శుక్రవారం సంస్థ గంటకు 265 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయే ఎఫ్99ని స్పోర్ట్స్ బైకును ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. వచ్చే 2-3మూడేండ్లలో మరో 3-4 మాడళ్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు ప్రకటించిన ఆయన... ఈ బైకులపై ఎనిమిదేండ్లు లేదా 8 లక్షల కిలోమీటర్ల వ్యారెంటీ కల్పిస్తున్నది.

సేల్స్‌ఫోర్స్ విస్తరణ

శాన్ ఫ్రాన్సిస్కో, సెప్టెంబర్ 19: కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ సేవల సంస్థ సేల్స్‌ఫోర్స్..భారత్‌లో తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. హైదరాబాద్‌తోపాటు బెంగళూరులలో ఉన్న సెంటర్లను ఆధునీకరించడానికి మరిన్ని పెట్టుబడులు పెట్టబోతున్నట్లు కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి బ్రియాన్ మిల్హమ్ తెలిపారు. మరోవైపు, కంపెనీ దేశీయ హెడ్ అరుంధతీ భట్టాచార్య మాట్లాడుతూ..భారత్‌లో ఉద్యోగుల సంఖ్యను గడిచిన రెండేండ్లలో రెండింతలు పెంచినట్లు, ప్రస్తుతం 13 వేల మంది విధులు నిర్వహిస్తున్నారని, మరింత మందిని తీసుకునే అవకాశాలున్నట్లు చెప్పారు.

హెరిటేజ్ ఐస్‌క్రీం ప్లాంట్

హైదరాబాద్, సెప్టెంబర్ 19: ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్..తాజాగా తెలంగాణలో ఐస్‌క్రీం ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. షామీర్‌పేట్‌లో రూ.204 కోట్ల పెట్టుబడితో నెలకొల్పబోతున్నట్లు తెలిపింది. ఈ ప్లాంట్ ఏర్పాటునకు సంబంధించి కంపెనీ బోర్డు డైరెక్టర్లు సమావేశమై గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తెలుగు రాష్ట్రాల్లో ఐస్‌క్రీంకు పెరుగుతున్న గిరాకీని దృష్టిలో పెట్టుకొని ఈ యూనిట్‌ను నెలకొల్పాలని నిర్ణయించినట్లు, వచ్చే ఏడాది నవంబర్ నాటికి ఈ యూనిట్ అందుబాటులోకి రానున్నట్లు కంపెనీ వర్గాల వెల్లడించాయి.

వాణిజ్య



టప్పర్‌వేర్ దివాలా

ఆర్థిక సంక్షోభంలో ప్లాస్టిక్ కిచెన్‌వేర్ దిగ్గజం • అమెరికా కోర్టులో పిటిషన్ దాఖలు
తగ్గిన గిరాకీ, పెరిగిన పోటీతో కుదేలు • రూ.10వేల కోట్ల రుణ భారం

'దివాలా ప్రక్రియ అంటే సంస్థ మనుగడకు కావాల్సిన వెసులుబాట్లను కల్పించడమే. ఈ కంపెనీ ఎక్కడికీ పోదు. ఎప్పట్లాగే ఇకపైనా మా నాణ్యమైన ఉత్పత్తులు మార్కెట్‌లో లభిస్తాయి'
-లారీ అన్ గోల్డ్‌మన్, టప్పర్‌వేర్ అధ్యక్షుడు, సీఈవో

న్యూయార్క్, సెప్టెంబర్ 19: ప్రముఖ ప్లాస్టిక్ కిచెన్‌వేర్ బ్రాండ్ టప్పర్‌వేర్ దివాలా తీసింది. అమెరికా బ్యాంకర్‌ప్సీ కోర్టులో చాప్టర్ 11 బ్యాంకర్‌ప్సీ రక్షణను కోరుతూ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఆహార పదార్థాల నిల్వలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిన ఈ సంస్థ.. ప్రస్తుత మార్కెట్‌లో నెలకొన్న పోటీని తట్టుకోలేక చతికిలపడింది. పర్యావరణ పరిరక్షణపై పెరిగిన అవగాహన, ప్లాస్టిక్ వినియోగంపై మారుతున్న కస్టమర్ల అభిప్రాయాలు సైతం టప్పర్‌వేర్ అమ్మకాలకు గండి కొట్టాయి.

80 ఏండ్ల కిందట..

అమెరికాలోని ఫ్లోరిడాలోగల ఓర్లాండో ప్రధాన కేంద్రంగా 1942లో టప్పర్‌వేర్ బ్రాండ్‌ను ఎర్ల్ టప్పర్ స్థాపించారు. 1946లో మార్కెట్‌కు వీటి ఉత్పత్తులు పరిచయమయ్యాయి. అప్పట్నుంచి టప్పర్‌వేర్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతూ వచ్చింది. కానీ మార్కెట్‌లో పెరిగిన పోటీతో అమ్మకాలు తగ్గుముఖం పట్టడం ప్రారంభమైంది. క్లీనెక్స్, టెఫ్లాన్, ఇతర బ్రాండ్ల దూకుడు ముందు టప్పర్‌వేర్ నిలదొక్కుకోలేకపోయింది. ఇక డైరెక్ట్ సేల్స్ నుంచి వినియోగదారులు దూరం జరుగడం కూడా సంస్థ వ్యాపారాన్ని దెబ్బతీసిందని దివాలా పిటిషన్‌లో టప్పర్‌వేర్ పేర్కొన్నది.

పీకల్లోతు అప్పులు

దివాలా పిటిషన్ ప్రకారం టప్పర్‌వేర్‌పై రూ.10,000 కోట్ల (1.2 బిలియన్ డాలర్లు) రుణ భారం ఉన్నది. రుణదాతలతో చేసుకున్న ఒప్పందాలనూ ఇది మీరినట్టు తెలుస్తున్నది. అయితే సుమారు రూ.5,700 కోట్ల (679.5 మిలియన్ డాలర్ల) ఆస్తులు కూడా ఉన్నట్టు కంపెనీ చెప్తున్నది. ఇక ప్రస్తుతం సంస్థ ఉద్యోగుల సంఖ్య 5,500. భారత్‌తోపాటు 41 దేశాల్లో వీరంతా పనిచేస్తున్నారు. 4.65 లక్షల కస్సలైంట్లూ ఉన్నారు. ఫ్రీలాన్స్ బేసిస్‌లో దాదాపు 70 దేశాల్లో టప్పర్‌వేర్ ఉత్పత్తులను అమ్ముతున్నారు.

భారత్‌లో యథాతథంగానే..

అమెరికా దివాలా కోర్టులో పిటిషన్ దాఖలు చేసినప్పటికీ.. భారత్‌లో టప్పర్‌వేర్ అమ్మకాలు యథాతథంగానే సాగుతాయని సంబంధిత వర్గాల నుంచి అందుతున్న సమాచారం. దేశీయంగానే టప్పర్‌వేర్ ఉత్పత్తుల తయారీ జరుగుతున్నది కాబట్టి.. అంతర్జాతీయ మార్కెట్‌లో తలెత్తిన ఇబ్బందులు ఇక్కడ ప్రభావం చూపబోవని వారంటున్నారు. అంతేగాక మునుపటిలాగే విస్తరణ ఉంటుందని, కస్టమర్ల అభిరుచులకు తగ్గట్టుగా నాణ్యమైన ఉత్పత్తులను మార్కెట్‌లోకి తెస్తామని చెప్తున్నారు. ఇప్పటికే గ్లాస్, స్టీల్ ఉత్పత్తులనూ టప్పర్‌వేర్ బ్రాండ్ అమ్ముతున్న విషయం తెలిసిందే.

దేశానికే ఆదర్శంగా స్కిల్ వర్సిటీ

- కంపెనీలు, పారిశ్రామికవేత్తలు భాగస్వాములవ్వాలి: సీఎం రేవంత్
- దసరా తర్వాత కోర్సులు ప్రారంభం

స్కిల్ యూనివర్సిటీపై సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్ బాబు, వర్సిటీ చైర్మన్ ఆనంద్ మహీంద్రా

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు, ప్రముఖ కంపెనీలు ఈ యూనివర్సిటీలో భాగస్వాములవ్వాలని, యువతకు నైపుణ్యాలను పెంచి.. వారికి ఉపాధి కల్పించేందుకు తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. యూనివర్సిటీ బోర్డుతోపాటు రాష్ట్రంలోని వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో గురువారం సచివాలయంలో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం తరపున 150 ఎకరాల స్థలంతోపాటు రూ.100 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు యూనివర్సిటీ నిర్వహణ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటుకు, భవనాల నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు. బోర్డు చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా యూనివర్సిటీకి బ్రాండ్ ఇమేజీని తీసుకువస్తారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. అలాగే ఇకపై తమ ప్రభుత్వం యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై దృష్టి సారిస్తుందన్నారు. దాదాపు 200 ఎకరాల్లో స్పోర్ట్స్ యూనివర్సిటీని నెలకొల్పి.. 2028 ఒలింపిక్స్‌లో దేశానికి గోల్డ్ మెడల్ తీసుకురావాలనే లక్ష్యంతో క్రీడాకారులకు శిక్షణను అందిస్తామన్నారు. ఇందుకోసం రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ.. ప్రపంచానికి నైపుణ్యమున్న యువతను అందించే గమ్యస్థానంగా తెలంగాణ నిలబడుతుందనడంలో సందేహం లేదన్నారు. కాగా, దసరా తర్వాత కోర్సులను ప్రారంభించనున్నట్టు బోర్డు సూచనప్రాయంగా వెల్లడించింది. తొలి ఏడాది 2వేల మందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, బోర్డు కో చైర్మన్ శ్రీని రాజు, సభ్యులు దేవయ్య, సుచిత్రా ఎల్లా, సతీష్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, స్పెయిన్ రాయబారి జువాన్ ఆంటోనియో మార్చ్ పుజోల్ గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంపై సీఎంను అభినందించారు. స్పెయిన్‌ను సందర్శించాల్సిందిగా ఆహ్వానించారు.

భారత్‌పై ఫెడ్ ప్రభావమెంత!

అర శాతం వడ్డీరేట్ల కోతపై భిన్నాభిప్రాయాలు

ముంబై, సెప్టెంబర్ 19: వడ్డీరేట్లను అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ అర శాతం కోత పెట్టిన నేపథ్యంలో భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల మీద ఆ ప్రభావం ఎంతన్నదానిపై నిపుణుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు దేశీయ ఎక్స్‌పర్ట్స్ పెట్టుబడులు పెరుగుతాయంటుంటే.. మరికొందరు ఈక్విటీలపై రాబడులు తగ్గుతాయని, బంగ